## కుటుంబ కలహాలు..కత్తితో దాడి

చార్మినార్, అక్టోబర్ 7: కుటుంబంలో తలెత్తిన వివాదాన్ని పరిష్కరించుకోవాలని సూచించడంతో ఓ వ్యక్తి పై హత్యాయత్నానికి పాల్పడిన ఘటన హుస్సేనిఆలం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సురేందర్ కథనం ప్రకారం... తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన రషీద్ తన సోదరిని ఫలక్‌నుమా ప్రాంతానికి చెందిన ఖాలేద్‌తో వివాహం జరిపించారు. కొంతకాలంగా సజావుగా సాగిన వారి కుటుంబంలో కలహాలు మొదలయ్యాయి. దీంతో శనివారం రషీద్ తన బావను తలాబ్‌కట్టలోని తన ఇంటికి పిలిపించుకొని మంచిగా ఉండాలని, గొడవలొద్దని చెప్పాడు. దీంతో మనసులో కక్ష పెంచుకున్న ఖాలీద్ రషీద్ హుస్సేనిఆలంలోని తన బంధువుల ఇంటికి వస్తుండగా చౌమహల్లా ప్యాలెస్ సమీపంలో ఖాలీద్ తన ద్విచక్ర వాహనాన్ని రషీద్ వాహనానికి అడ్డుగా పెట్టి కత్తితో అతడిపై దాడికి పాల్పడ్డాడు. వెంటనే తేరుకున్న రషీద్ ఖాలీద్ దాడి నుంచి తప్పించుకున్నారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు బాధితున్ని చికిత్స నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకుని నిందితుడి కోసం గాలిస్తున్నామని ఇన్‌స్పెక్టర్ సురేందర్ తెలిపారు.

## పట్టు తప్పి .. మిద్దె పై నుంచి పడి

### 15 ఏండ్ల బాలుడి మృతి



బంజారాహిల్స్,అక్టోబర్ 6: ప్రమాదవశాత్తు భవనం పై నుంచి కింద పడిన దివ్యాంగుడైన బాలుడు మృతి చెందిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. శ్రీనగర్ కాలనీలోని మాఫర్స్ ఎస్టేల్లా అపార్ట్‌మెంట్‌లో పంబలి బాలస్వామి అనే వ్యక్తి వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. గ్రౌండ్‌ఫ్లోర్‌లోని సర్వెంట్ రూమ్‌లో నివాసం ఉంటున్నాడు. బాలస్వామికి దివ్యాంగుడైన కొడుకు గుణశేఖర్(15) ఉన్నాడు. వీల్‌చైర్‌లో తిరిగే గుణశేఖర్ అప్పుడప్పుడూ లిఫ్ట్‌లో అపార్ట్‌మెంట్‌లోని 6 అంతస్తులోని టెర్రస్‌పైకి వెళ్లి కాలక్షేపం చేస్తుంటాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి 9.30 ప్రాంతంలో లిఫ్ట్‌లో టెర్రస్‌పైకి వెళ్లిన గుణశేఖర్ కాసేపటికి టెర్రస్ అంచున వీల్‌చైర్‌లో కూర్చున్నాడు. కింద నుంచి తల్లి పిలిచిన శబ్దం వినిపించడంతో అక్కడినుంచే కిందకు తొంగి చూసేందుకు యత్నిస్తూ ఒక్కసారిగా పట్టుతప్పి కింద పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలైన గుణశేఖర్‌ను కుటుంబసభ్యులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తండ్రి బాలస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## తెల్లవారుజాము.. లాంగ్‌డ్రైవ్

### కారు అదుపు తప్పి..ఇద్దరు మృతి

కీసర, అక్టోబర్ 7: కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కీసర పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మేడ్చల్ మండల పరిధి... శామీర్‌పేట్‌లోని విశ్వవిద్యాల కళాశాలలో తుషార (18) బీబీఏ మొదటి సంవత్సరం చదువుతున్నది. రోజు మాదిరిగానే కాలేజీ ముగించుకొని ఆమె క్లాస్‌మేట్స్ అయిన ఇంద్రకంటి హరిప్రియ ఆమె స్నేహితులైన భవేష్‌రావు, రూబెన్, ఫిలిప్స్ జాన్ కారులో గత రాత్రి 11.40 గంటలకు లాంగ్‌డ్రైవ్‌కు వెళ్లారు. తెల్లవారు జామున శనివారం 4.30గంటల సమయంలో కీసర సమీపంలోని గోశాల వద్ద కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ రోడ్డు ప్రమాదంలో భవేష్‌రావు, తుషార అక్కడికక్కడే మృతిచెందగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయాలైన వారిని చికిత్స నిమిత్తం ప్రైవేట్ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## విదేశాల నుంచి ఫోన్లు..

### అనుమతి లేకుండా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 7: అనుమతి లేకుండా ఫోన్లు తరలిస్తున్న వ్యక్తిని కస్టమ్స్ అధికారులు అరెస్టు చేసి అతడి నుంచి 37.70 లక్షల విలువైన ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన శనివారం ఎయిర్‌పోర్టులో జరిగింది. కస్టమ్స్ అధికారుల కథనం ప్రకారం... టొరంటో నుంచి శంషాబాద్(హైదరాబాద్) ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఓ ప్రయాణికుడిని అడ్డుకొని అతడు తీసుకొచ్చిన ఫోన్లకు సంబంధించిన వివరాలు కోరగా అతడి వద్ద సరైన పత్రాలు లేకపోవడంతో అదుపులోకి తీసుకున్నారు. అతడు తీసుకువచ్చిన 35 ఫోన్లు (ఐఫోన్, శామ్‌సంగ్), స్మార్ట్ వాచ్‌లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ఫోన్ల విలువ 37.70 లక్షల రూపాయల విలువ ఉంటుందని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఎయిర్‌పోర్టులో పట్టుబడిన విదేశాల నుంచి తీసుకొచ్చిన ఫోన్లు

# అగ్ని ప్రమాదంలో 39 మందిని కాపాడి..

### హోంమంత్రి చేతుల మీదుగా శౌర్య పతకం అందుకున్న ఫైర్‌మెన్ రాజు

అమీర్‌పేట్, అక్టోబర్ 7: నగరంలో 2019 మార్చిలో సెక్రటేరియట్ సమీపంలో ఆంధ్రాబ్యాంకు కొనసాగుతున్న ఓ భవంతిలోని 5వ అంతస్తులో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఇదే భవంతిలోని 6వ అంతస్తులో ఉన్న ఆంధ్రాబ్యాంకు కార్యాలయంలో 39 మంది అధికారులు సమావేశమయ్యారు. కింది అంతస్తులో జరిగిన అగ్నిప్రమాదం గురించి సమాచారం లేకపోవడంతో మంటలు తీవ్రమై పొగ కమ్ముకోవడంతో బ్యాంకు అధికారులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఈ ఘటనలో ఫైర్ ఫైటింగ్‌లో ఉన్న ఫైర్‌మెన్ రాజు ఎనపోతుల 6వ అంతస్తులో పరిస్థితిపై సమాచారం అందుకుని ఉన్నతాధికారుల సూచనల మేరకు వీరోచితంగా రక్షణ చర్యలకు ఉపక్రమించారు. వెంటనే బ్రీథింగ్ ఆపరేటర్ సెట్ ధరించిన రాజు 6వ అంతస్తులోకి చేరుకొని అక్కడే ఉన్న బ్యాంకు అధికారులకు పొగ ప్రభావం నేల నుంచి రెండు అడుగుల లోపు తక్కువ ప్రభావంతో ఉంటుందని, మోకాళ్లపై పాకుతూ కిందకు వెళ్లాలని స్పష్టమైన సూచనలిస్తూ వారికి అవసరమైన మాస్కులు అందజేశారు. ఒక్కో ప్రయత్నంలో ఇద్దరి చొప్పున వారిని సురక్షితంగా కింది అంతస్తులకు తరలించారు. దాదాపు అర్ధగంటకు పైగా కొనసాగిన ఈ ఆపరేషన్‌లో అందరూ సురక్షితంగా కిందకు వచ్చారు. బ్యాంకు అధికారులను కాపాడే క్రమంలో వీరోచితంగా వ్యవహరించిన రాజు ఎనపోతులకు ప్రభుత్వం 2020లో శౌర్య పతకాన్ని ప్రకటించింది. అయితే కొవిడ్ పరిస్థితుల కారణంగా ఇప్పటి వరకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా అవార్డులు అందించే కార్యక్రమాన్ని చేపట్టలేదు. శుక్రవారం ఎల్బీనగర్ అగ్నిమాపక కేంద్రం ప్రారంభోత్సవానికి విచ్చేసిన హోంమంత్రి గతంలో ప్రకటించిన అవార్డులను అందజేశారు. అప్పట్లో సెక్రటేరియట్ కేంద్రంలో ఫైర్‌మెన్‌గా పని చేసిన రాజు ప్రస్తుతం సనత్‌నగర్ అగ్నిమాపక కేంద్రంలో లీడింగ్ ఫైర్‌మెన్‌గా కొనసాగుతున్నారు. శౌర్య పతకాన్ని అందుకున్న రాజు ఎనపోతులను ఎస్‌ఎఫ్‌వో ప్రదీప్‌కుమార్ సహా సిబ్బంది అభినందించారు.



హోంమంత్రి మహమూద్ అలీ చేతుల మీదుగా శౌర్య పతకాన్ని అందుకుంటున్న ఫైర్‌మెన్ రాజు

# అనుమానమే పెనుభూతమై..

- భార్యను హత్య చేసిన భర్త
- 24 గంటల్లోపు అరెస్టు చేసిన పోలీసులు

వనస్థలిపురం, అక్టోబర్ 7: తనతో దూరంగా ఉంటున్న భార్య వేరే వ్యక్తితో సన్నిహితంగా ఉంటుందన్న అనుమానం పెనుభూతమైంది. తనను పట్టించుకోవడం లేదన్న ఉద్దేశంతో కక్ష పెంచుకున్న ఓ భర్త రాక్షసుడిలా మారి, కట్టుకున్న భార్యను దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ జలంధర్ రెడ్డి కథనం ప్రకారం... ఆంధ్రప్రదేశ్, ప్రకాశం జిల్లా సంతనూతల పాడుకు చెందిన శాలిని, బాలకోటయ్య దంపతులు. బతుకుదెరువు కోసం కొన్నేళ్ల క్రితం నగరానికి వచ్చారు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. గత ఏడాది మునగనూరులో ఇళ్లు కట్టుకుని అక్కడే నివాసముంటున్నారు. కాగా మూడు నెలల క్రితం ఆర్థిక సమస్యలతో భార్యాభర్తల మధ్య గొడవలు మొదలయ్యాయి. దీంతో శాలిని తన ఇద్దరు కొడుకులతో వనస్థలిపురం విజయపురి కాలనీ ఫేజ్-1లోని తల్లిగారి ఇంట్లో ఉంటుంది. నిందితుడు హయత్‌నగర్ బొమ్మల గుడి సమీపంలో ఉంటున్నాడు. దూరంగా ఉన్న భార్య తనను పట్టించుకోవడం లేదని కోపం పెంచుకున్నాడు. దీంతోపాటు మరో వ్యక్తితో సన్నిహితంగా ఉంటుందన్న అనుమానంతో హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. శుక్రవారం రాత్రి శాలిని తన యాక్టీవా వాహనం(టీఎస్ 08 ఈక్యూ 4579)పై బయటకు వెళ్లి వస్తోంది. ముందుగానే పథకం ప్రకారం సాయిబాబా గుడి వద్ద మాటు వేసిన బాలకోటయ్య అక్కడికి రాగానే ఆమెను బైక్ పైనుంచి తోసేశాడు. కిందపడటంతో పక్కనే ఉన్న బండరాయితో ఆమె తలపై కొట్టి హత్య చేసి పారిపోయాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు రంగంలోకి దిగారు.

### పాప పరిహారం కోసం అన్నవరానికి...

భార్యను హత్య చేసి పాప పరిహారం కోసం నిందితుడు అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానానికి వెళ్లాడు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు పక్కా సమాచారంతో శుక్రవారం అర్ధరాత్రి అన్నవరం బయలు దేరారు. శనివారం నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలుస్తోంది.

## ఇద్దరు చైన్ స్నాచర్లు అరెస్ట్

సిటీబ్యూరో,అక్టోబర్ 7(నమస్తే తెలంగాణ) : నగరంలో చైన్ స్నాచింగులకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. జల్‌పల్లిలో నివాసం ఉంటూ ట్రాలీ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న సిద్దిపేటకు చెందిన కురకుల రోహిత్(21), క్యాబ్ డ్రైవర్‌గా జీవనం సాగించే గొల్లసుల అలికేష్(23) నగరంలోని రాజేంద్ర నగర్, అంబర్‌పేట్ పీఎస్‌ల పరిధిలో దొంగతనాలకు పాల్పడుతుండగా... ఇరువురిని అంబర్‌పేట్, ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు కలిసి అరెస్టు చేసి 29.7గ్రాముల బంగారు నగలు, టూవీలర్‌ను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ అదనపు డిప్యూటీ కమిషనర్ ఏవీఆర్ నర్సింహారావు మీడియా సమావేశంలో నిందితుల వివరాలు వెల్లడించారు. సిద్దిపేటలోని మూడు పీఎస్‌ల పరిధిలో గంజాయి సరఫరా కేసుల్లో ఇరువురు ప్రధాన నిందితులు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా రోహిత్ తన స్నేహితుడైన అలికేష్‌తో కలిసి దొంగతనాలకు పాల్పడుతున్నాడు. పోలీసులు నిందితులను పట్టుకున్నారు.అనంతరం టాస్క్‌ఫోర్స్, పోలీసులను నర్సింహారావు అభినందించారు.

# బైకు ఆపబోతుండగా ..వెనక నుంచి బస్సొచ్చి..

### బస్సు ఢీకొని మహిళ మృతి

మొయినాబాద్, అక్టోబర్ 7: ఆర్టీసీ బస్సు బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టడంతో బస్సు ముందు చక్రాల కింద పడి ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన మొయినాబాద్ మండల పరిధిలోని అజీజ్‌నగర్ పాత గేట్ వద్ద హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఏవీ రంగా కథనం ప్రకారం... చేవెళ్ల మండల పరిధిలోని తంగడిపల్లి గ్రామానికి చెందిన బండ కవిత(38), ఆమె భర్త భాస్కర్‌గౌడ్, కుమారుడు రాకేశ్‌తో కలిసి హైదరాబాద్‌లోని ఆసిఫ్‌నగర్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. మెహిదీపట్నంలోని రైతుబజార్‌లో భార్యాభర్తలు కూరగాయల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారానికి ఒకసారి స్వగ్రామం తంగడిపల్లికి వస్తుండేవారు. శనివారం కుమారుడు రాకేశ్, భర్త భాస్కర్‌గౌడ్‌తో కలిసి స్వగ్రామానికి బైక్‌పై వస్తున్నారు. మొయినాబాద్ మండల పరిధిలోని అజీజ్‌నగర్ పాత గేట్ వద్ద ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ట్రాఫిక్ పోలీసులు బైక్‌ను ఆపడంతో స్లో చేస్తున్న క్రమంలో రాజేంద్ర నగర్ బస్సు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అతివేగంగా వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. దీంతో బైక్ వెనకాల కూర్చున్న కవిత ఆర్టీసీ బస్సు ముందు చక్రాల కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు మృతదేహంతో రోడ్డుపై ఆందోళన చేశారు. సీఐ ఏవీ రంగా, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులు, గ్రామస్తులను సముదాయించారు. వెంటనే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్లలోని ప్రభుత్వ దవాఖాన మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆర్టీసీ బస్సును పోలీస్ స్టేషన్‌కు తరలించి, డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతురాలికి ఇద్దరు బిడ్డలు, ఒక కుమారుడు ఉన్నాడు.

## వాహనాల తనిఖీల్లో 31 లక్షలు స్వాధీనం

మాదన్నపేట, అక్టోబర్ 7: రెండు చోట్ల ఎలాంటి ఆధారాలు లేకుండా వాహనాల్లో తరలిస్తున్న రూ.31 లక్షలను తనిఖీల్లో భాగంగా పోలీసులు సీజ్ చేశారు. ఈ ఘటన ఐఎస్ సదన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ మల్లేశ్ కథనం ప్రకారం.... శనివారం సాయంత్రం డీఎంఆర్‌ఎల్ చౌరస్తా వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా షిఫ్ట్ డిజైర్ వాహనంలో రూ.20 లక్షలు తరలిస్తున్నారు. కారులో ఉన్న విఠల్, నాగరాజు, శ్రీకాంత్, క్యాబ్ డ్రైవర్‌లను విచారించగా రియల్ ఎస్టేట్ డబ్బులని ఒకరు, ఇంకొకరు పొంతనలేని సమాధానం చెప్పారు. సరైన పత్రాలు చూపించకపోవడంతో ఆ డబ్బులను సీజ్ చేశామని పోలీసులు తెలిపారు.

### మరొక చోట రూ. 11.70 లక్షలు

జీడిమెట్ల, అక్టోబర్ 7 : ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.11.70 లక్షల నగదును వాహనంలో తీసుకెళ్తున్న ఇద్దరు వ్యక్తుల వద్ద లభించడంతో జీడిమెట్ల పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం జీడిమెట్ల సీఐ పవన్ నేతృత్వంలో కుత్బుల్లాపూర్ చౌరస్తాలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో గాజులరామారానికి చెందిన దామ అశోక్ కారును తనిఖీ చేయగా రూ.10 లక్షలు, అల్వాల్ భూదేవినగర్‌కు చెందిన బోళ్ల వెంకటేశ్వర్ వద్ద రూ.1.70 లక్షలను స్వాధీనం చేసుకొని సరైన ఆధారాలు చూపించి డబ్బు తీసుకోవాలని పోలీసులు కోరారు.

## కేసరి కుస్తీలో.. ఘర్షణ

ఖైరతాబాద్, అక్టోబర్ 7: ఓ వైపు కుస్తీ పోటీలు జరుగుతుండగా, అందులో పాల్గొనేందుకు వచ్చిన పహిల్వాన్లు ఘర్షణ పడ్డారు. ఈ ఘటన సైఫాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్బీ స్టేడియంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... ఎల్బీ స్టేడియంలో మోదీ కేసరి పేరుతో కుస్తీ పోటీలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అందులో పాల్గొనేందుకు వచ్చిన ఇద్దరు పహిల్వాన్ల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో ఇరు వర్గాలకు చెందిన వారు పరస్పరం దాడులు చేసుకోవడంతో పోలీసులు జోక్యం చేసుకొని వారిని చెదరగొట్టారు. ఈ ఘటనలో బెంబేలెత్తిన ప్రేక్షకులు బయటకు పరుగులు తీశారు. ఇరు వర్గాలను అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.